సాక్షి జోగులాంబ గద్వాల

శనివారం । 22 । మార్చి । 2025



బెట్టింగ్ భూతం

నేటినుంచి ఐపీఎల్ ప్రారంభం కానుండగా.. బెట్టింగ్ భూతం జడలు విప్పుతోంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-29 (శనివారం సాయంత్రం)

సహర్ 5-08 (ఆదివారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.3 /22.7

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళల రక్షణే షీటీం ప్రధాన లక్ష్యం



గద్వాల క్రైం: మహిళల రక్షణ కోసం షీ టీంలు విధులు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ మొగిలయ్య అన్నారు. శుక్రవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థులపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. గద్వాల – అలంపూర్ సెగ్మెంట్‌లలో 81 సమస్యాత్మక ప్రదేశాను గుర్తించి నిత్యం గస్తీ చేపట్టామన్నారు. వేధింపులకు గురిచేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు సైతం తరలించామన్నారు. కళాశాలలో ర్యాగింగ్ వంటివి చేస్తే నిర్భయంగా అధ్యాపక బృందానికి తెలియజేయాలని, వేధింపులకు గురిచేసినా, సామాజిక మాధ్యమాల ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేసిన బాధితులు నేరుగా షీటీం సభ్యులకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా 8712670312కు సంప్రదించాల్సిందిగా డీఎస్పీ తెలిపారు.

26న తైబజార్ వేలం

అలంపూర్: అలంపూర్ మున్సిపాలిటీ తైబజార్ వేలం పాటను ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు, ఆసక్తి ఉన్న వారు 25వ తేదీ వరకు దరఖాస్తు ఫారాలను మున్సిపల్ కార్యాలయంలో తీసుకొని నిబంధనల మేరకు సాయంత్రం 5 గంటలోపు డీడీ డిపాజిట్లు అందజేయాలని తెలిపారు. మిగిలిన వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలు



గద్వాల: విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు శుక్రవారం తన ఛాంబర్‌లో కలెక్టర్ బీఎం సంతోష్ కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించి గుర్తింపు పొందాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అమలు చేస్తూ పారదర్శకత, నిబద్ధత, ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, జెడ్పీ డిప్యూటీ సీఈవో నాగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అడ్డంకులు..!

పన్ను వసూళ్లలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లు



గద్వాల మున్సిపాలిటీలో పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

- వంద శాతం పన్ను వసూలు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- ఇరువురి మధ్య నలుగుతున్న మున్సిపల్ అధికారులు
- జిల్లా కేంద్రంలో పన్ను వసూలైంది 46.4 శాతమే..

గద్వాల మున్సిపల్ వివరాలిలా..

ఆస్తిపన్ను డిమాండ్	వసూలైన పన్నులు
రూ.4.23 కోట్లు	రూ.2.74 కోట్లు
వసూలు శాతం 46.4 శాతం	
పాత బకాయిలు	వసూలైనవి..
రూ.2.15 కోట్లు	రూ.28.50 లక్షలు

గద్వాలటౌన్: 'కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం' అన్న చందంగా తయారైంది గద్వాల మున్సిపల్ అధికారుల పరిస్థితి. పట్టణంలో పన్ను వసూళ్లకు ఉన్నతాధికారులు లక్ష్యాలు విధించారు. రోజువారి వసూళ్లకు రాజకీయ నేతలు మోకాలడ్డుతున్నారు. ఎవరి దగ్గరకు వెళ్లినా మాజీ కౌన్సిలర్లు, లేదా పెద్ద రాజకీయ నాయకులతో ఒత్తిళ్లు చేయిస్తున్నారు. లేదా చెల్లించమని బెదిరిస్తున్నారు. దీంతో పన్నులు వసూలు కాక ఉన్నతాధికారులకు సమాధానాలు చెప్పలేక నలిగిపోతున్నారు. ఇదీ జిల్లా కేంద్రమైన గద్వాల మున్సిపాలిటీలో అధికారుల పరిస్థితి.

రెండు వారాల్లో పెరిగిన వేగం

ఆర్థిక సంవత్సరం మరో 12 రోజుల్లో ముగుస్తోంది. దీంతో పన్నుల వసూళ్లల్లో కమిషనర్ దశరథ్, రెవెన్యూ అధికారులు దూకుడు పెంచారు. బడాబకాయిదారుల జాబితాను చేతపట్టి అధికారులు నేరుగా దుకాణాలకు వెళ్తున్నారు.. ఆస్తిపన్ను చెల్లించే వరకు కట్టు కదలడం లేదు. ఈ క్రమంలో దుకాణాదారులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. మాజీ కౌన్సిలర్లు, రాజకీయ నాయకుల సిఫార్సులను పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు రోజువారి లక్ష్యాలు నిర్దేశిస్తుండటంతో... వారి ఆదేశాల మేరకు పన్ను వసూళ్లలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గడిచిన రెండు వారాలుగా పన్ను వసూళ్లల్లో వేగం పెరిగింది.

నోటీసులు జారీ చేస్తున్నాం..



ఆస్తిపన్ను నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి అధికారులు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. గడిచిన కొన్ని రోజులుగా పన్ను వసూళ్ల వేగం పెరిగింది. బడా బకాయిదారులకు నోటీసులు జారీ చేశాం. ప్రస్తుతం వారు పన్ను చెల్లించడానికి ముందుకు వస్తున్నారు. ఈ నెలాఖరులోగా వందశాతం పన్ను వసూళ్లు చేస్తాం.

– దశరథ్, కమిషనర్, గద్వాల

ఒత్తిళ్ల పర్వం

జిల్లా కేంద్రంలోని ఓ కూడలిలో హోటల్ యజమాని రూ.17,500 ఆస్తిపన్ను చెల్లించాలి. దీన్ని చెల్లించాలని రెవెన్యూ విభాగం సిబ్బంది కోరగా 'ఏం వేధిస్తున్నారు? నా ఇష్టం వచ్చినప్పుడు కడతా.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి..? మీకు మా కౌన్సిలర్‌తో ఫోన్ చేయించాలా..' అంటూ హోటల్ యజమాని సమాధానమిచ్చాడు. మరో దగ్గరికి వెళ్తే.. 'హలో.. ఆర్ఐ గారు.. ఆ దుకాణం మా వాడిదే. నిదానంగా పన్ను చెల్లిస్తాడు. కొద్దిగా చూసీచూడనట్లు వెళ్లండి. అయినా పన్ను అంత ఎందుకు వచ్చింది..' ఇదీ వార్డుల్లో మాజీ కౌన్సిలర్లు, పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులు పన్నులు వసూలు చేసే మున్సిపాలిటీ అధికారులకు చేస్తున్న సిఫార్సుల పర్వం. ఇలా పన్నుల వసూలు చేసే అధికారులకు, సిబ్బందికి వ్యాపార దుకాణాలు, సంస్థలు నిర్వహిస్తున్న భవన నిర్మాణదారులు పన్నులు చెల్లింపుల్లో మున్సిపాలిటీ అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. మరోవైపు రోజుకు ఎన్ని లక్షలు వసూలు చేశారని పుర ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. మార్చి నెలాఖరుకు బడ్జెట్ రూపొందించుకోవాలి. దీనికి పన్నుల వసూళ్ల రూపంలో వచ్చే ఆదాయమే ప్రధానం. పట్టణంలో ఏ అభివృద్ధి పనులు చేయాలన్నా.. పారిశుద్ధ్యం, తాగునీరు సరాఫరా వంటి అత్యవసర సేవలు అందించాలన్నా పన్నులు వసూళ్లు బాగుంటేనే సాధ్యమవుతుంది. కానీ భవన నిర్మాణదారులు ఎలాగోలా చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. కొందరు వ్యాపార దుకాణదారులు మాత్రం ససేమిరా అంటున్నారు. చెల్లింపుల్లో రాజకీయ నాయకులు, మాజీ కౌన్సిలర్లతో సిఫార్సులు చేయిస్తున్నారు. దీంతో పన్నుల వసూళ్లకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

గద్వాల క్రైం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి అన్నారు. శనివారం జిల్లా ఆస్పత్రిలో న్యాయపరమైన సమస్యలు, చట్టాలపై మాట్లాడారు. బుద్ధిమాంద్యం గల వ్యక్తులు వివిధ దశలలో న్యాయపరమైన హక్కులను వినియోగించకలేకపోతున్నారని, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్యుల నుంచి పూర్తి సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి సిద్దప్ప, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,219

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 1464 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6219, కనిష్టం రూ.3249, సరాసరి రూ.4869 ధరలు పలికాయి. అలాగే, 20 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.6439, కనిష్టం రూ.5689, సరాసరి రూ.6439 ధరలు వచ్చాయి. 39 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 6061, కనిష్టం రూ. 5719, సరాసరి రూ. 6039 ధరలు లభించాయి.

నేడు మున్సిపల్ ప్రత్యేక అధికారితో 'సాక్షి' ఫోన్ ఇన్

గద్వాల: జిల్లాలో పుర పాలకవర్గాల పదవీ కాలం **ముగియడంతో** నాలుగు మున్సిపాలిటీలకు **ప్రత్యేక అధికారిగా** అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల) నర్సింగ్‌రావుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు **అప్పగించింది.** ఈ నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల్లో **ప్రజలు** ఎదుర్కొంటున్న సమస్యలను **నేరుగా ప్రత్యేక** అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేసుకునేందుకు శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది.



నర్సింగ్‌రావు, మున్సిపల్ ప్రత్యేక అధికారి

ఫోన్ చేయాల్సిన నంబర్లు : 9849907791, 7013959652

సమయం : శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు..

మొదటిరోజు 99.58 శాతం హాజరు



గద్వాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

- ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు

గద్వాలటౌన్: పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 7,597 మంది విద్యార్థులకుగాను 7,565 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. 32 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. 99.58 శాతం హాజరు నమోదైంది. మొత్తం 40 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక అంధుల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు సహాయకుల సహాయంతో పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు బెంచీలను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని గదులలో వెలుతురు సక్రమంగా లేక, ఫ్యాన్ల కొరతతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు, మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. మొత్తం తొమ్మిది ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు వేర్వేరుగా జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. పరీక్ష ముగిసే వరకు అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచారు. విద్యార్థులను గంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

కలెక్టర్, ఎస్పీ తనిఖీ

పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు వేర్వేరుగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాలలో ఉన్న మౌలిక సదుపాయాలను వారు పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోని సిబ్బంది తప్పని సరిగా గుర్తింపు కార్డు ధరించి ఉండాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, విద్యారుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాల్ ప్రాక్టీస్‌కి అవకాశం లేకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అంధత్వాన్ని జయిస్తూ..

చదువుకోవాలన్న వారిలోని తపనను అంధత్వం అడ్డుకోలేక పోయింది. ఆత్మవిశ్వాసమే ఆలంబనగా ఒక్కో మెట్టు పైకెక్కుతూ ఉన్నత చదువుల దిశగా అడుగులు వేస్తూ వారు ముందుకు సాగుతున్నారు. గద్వాల అంధుల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థినీ, విద్యార్థులు శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యారు. ప్రస్తుతం సహాయకుల (స్క్రైబ్) సహాయంతో పరీక్షలు రాశారు. అన్ని సవ్యంగా ఉన్నా చదువుపై ఆసక్తి చూపని విద్యార్థులకు వీరు ఆదర్శంగా నిలిచారు.



గద్వాలలో సహాయకుల సహాయంతో పరీక్షలు రాసి వస్తున్న అంధ విద్యార్థులు

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలి

మానవపాడు: జాతీయ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎ.బుద్ధిపాడు, కలుకుంట్ల, మానవపాడులో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో 50 మందికి పైగా కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్నవారందరికీ అవగాహన కల్పించాలని ఫీల్డ్‌అసిస్టెంట్లను ఆదేశించారు. క్లస్టర్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామానికి ఉపయోగపడే పనులు చేపట్టాలని, గ్రామపరిదిలోని చిన్నపాటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేసుకోవాలని పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందించాలన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించి అనుకున్న లక్ష్యాలను చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇదిలాఉండగా, ఉపాధి హామీ కూలి రూ.300కు పెంచాలని కలుకుంట్ల కూలీలు అడిషనల్ కలెక్టర్‌ను కోరారు.



కలుకుంట్లలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

సంస్కృతి ఉట్టిపడేలా.. యువ ఉత్సవ్ పోటీలు



ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్స్



సందేశాత్మక జానపద నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న విద్యార్థులు

గద్వాలటౌన్: పల్లెజీవనం ప్రతిబింబించే నృత్యాలు.. సంస్కృతిలో ఆచార వ్యవహారాల ప్రదర్శనలు.. శాస్త్రీయ జానపద నృత్యాలు ఇలా ఎన్నో భారతీయ కళలు ఉట్టిపడేలా జిల్లాస్థాయి యువ ఉత్సవ్ పోటీలు సాగాయి. భారత ప్రభుత్వం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం వారు కళాశాల విద్యార్థులకు యువ ఉత్సవ్ – 2025 పోటీలు నిర్వహించారు. శుక్రవారం ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోటీలకు వేదికైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ఒకరికి మించి ఒకరు చక్కటి ప్రతిభ కనబర్చి న్యాయ నిర్ణేతల మెప్పు పొందారు. విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలు, జీవనశైలి తదితర అంశాలతో కూడిన నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. సందేశాత్మకమైన అంశాలతో పలువురు విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి మెప్పు పొందారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాషా, ప్రభుత్వ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తి వెలికితీయడానికి పోటీలు దోహదం చేస్తాయన్నారు. అనిల్‌గౌడ్, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

యువికా.. నవ శాస్త్రవేత్తలకు వేదిక

ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాని కార్యక్రమానికి శ్రీకారం

- ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సదావకాశం
- ఆన్‌లైన్‌లో అందుబాటులో ఇస్రో ప్రత్యేక వెబ్‌సైట్
- రేపటి వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 45,969 మంది విద్యార్థులు



నారాయణపేట రూరల్: విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చక్కని అవకాశం కల్పిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. యువికా (యువ విజ్ఞాని కార్యక్రమం) పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శిక్షణకు హాజరయ్యేందుకు రవాణా చార్జీలు, బస, భోజన వసతితో పాటు సౌకర్యాలను ఇస్రోనే కల్పించనుంది. అయితే ఉమ్మడి జిల్లా పరిధిలో 45,969 మంది 9వ తరగతి విద్యార్థులు ఉండగా ఇందులో ఎంత మంది ఔత్సాహికులు ముందుకు వస్తారో వేచి చూడాల్సి ఉంది.

దరఖాస్తు విధానం..

విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదట వారి ఈమెయిల్ ఐడీతో ఇస్రో వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. క్విజ్ పూర్తి చేసిన 60 నిమిషాల తర్వాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలి. దరఖాస్తుతోపాటు విద్యార్థి సంతకం చేసిన ప్రతి, విద్యార్థి గత మూడేళ్లలో వివిధ అంశాల్లో సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి.

ఈ నెల 23 వరకు..

దరఖాస్తులు సమర్పించేందుకు ఈ నెల 23 వరకు అవకాశం కల్పించారు. ఎంపికైన విద్యార్థుల తొలి జాబితాను ఏప్రిల్ 7న అర్హత సాధించిన వారికి సమాచారం అందిస్తారు. ఎంపికైన విద్యార్థులు మే 18న ఇస్రో కేంద్రాల వద్ద రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మే 19 నుంచి మే 30 వరకు ఎంపికైన విద్యార్థులకు 7 శిక్షణ కేంద్రాల్లో యువికా కార్యక్రమం నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	బాలురు	బాలికలు
నారాయణపేట	147	8,873	4,372	4,501
మహబూబ్‌నగర్	293	13,961	7,390	6,571
జోగులాంబ గద్వాల	163	7,287	3,830	3,552
నాగర్‌కర్నూల్	205	7,880	4,583	3,297
వనపర్తి	179	7,968	4,101	3,867

ఎంపిక విధానం ఇలా..

ఈ విద్య సంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల వారికి తొలి ప్రాధాన్యం ఉంటుంది. 8వ తరగతిలో పొందిన మార్కులు, మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏదైనా వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ ప్రతిభ పరీక్షలు, ఒలింపియాడ్‌లో పాల్గొని మొదటి, మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. రిజిష్టర్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన వారు, స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో సభ్యులుగా ఉండటం, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ చూపిన వారికి ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది.


వేసవిలో శిక్షణ..

శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు వేసవి సెలవుల్లో మే 19 నుంచి 30 వరకు 12 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుంది. విద్యార్థితోపాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ ఉపాధ్యాయుడికి కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ తర్వాత శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌కు తీసుకెళ్లి అక్కడి విశేషాలను ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పిస్తారు.

ఇవీ కేంద్రాలు..

1. ఐఐఆర్ఎస్, డెహ్రాడూన్
2. విక్రమ్ సారాబాయి స్పేస్ సెంటర్, తిరువనంతపురం
3. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట
4. యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, బెంగుళూరు
5. స్పేస్ అప్లికేషన్ సెంటర్, అహ్మదాబాద్
6. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్
7. నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, షిల్లాంగ్

విద్యార్థులను ప్రోత్సహించాలి..



వైజ్ఞానిక పోటీల్లో పాల్గొనేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన, అంతరిక్ష పరిశోధనా రంగాలపై ఆసక్తి పెంపొందించడానికి యువికా తోడ్పడుతుంది. ఎంపికైన విద్యార్థులకు స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తారు.

– భానుప్రకాశ్, జిల్లా సైన్స్ అధికారి, నారాయణపేట

క్లుప్తంగా

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఈరమ్మ

మల్దకల్ : కుటుంబ కలహాలతో ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని చర్లగార్లపాడులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. చర్లగార్లపాడుకి చెందిన ఈరమ్మ భర్త నర్సింహులుకు ఇద్దరు సంతానం. వారికి ఉన్న కొద్ది పాటి వ్యవసాయ పొలంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఈరమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

- భార్యే చంపిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి అక్క


అంజన్న (ఫైల్)

నర్వ: మండలంలోని లంకాల్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాలెం అంజన్న (41)కు 17 ఏళ్ల కిందట మక్తల్ మండలం కర్నికి చెందిన రంగమ్మతో వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అంజన్న నారాయణపేటలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తించేవాడు. అంజన్న ఇటీవల తన పేరున ఉన్న భూమిలో కొంతభాగాన్ని దాయాదులకు పట్టా చేయడంతో భార్య తరచూ గొడవ పడేది. అలాగే కొంత భూమి అమ్మగా వచ్చిన డబ్బులు ఇవ్వాలని, మిగిలిన భూమిని తన పేరున పట్టా చేయాలంటూ వేధించేది. అంజన్న మృతిచెందినట్లు గ్రామస్తులు శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అక్క దుప్పల్లి పద్మమ్మకు సమాచారం అందించారు. ఆమె వచ్చి చూడగా మెడ చుట్టూ తాడు బిగించి చంపినట్లు కందిన గాయాలు కనిపించడంతో తమ్ముడి మృతిపై అనుమానం ఉందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్క ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

- అంజన్న మృతిపై నారాయణపేట చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. మెర్సీ వసంత, జూనియర్ అసిస్టెంట్ రంగారెడ్డి, సూపరింటెండెంట్ జయపాల్, ఇతర సిబ్బంది నివాళులు అర్పించారు.

వ్యక్తి బలవన్మరణం

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌కు చెందిన దాసరి చిన్నయ్య (32) గురువారం రాత్రి గ్రామంలోని ఓ రైస్‌మిల్లు వద్ద నిలిపిన డీసీఎం వాహనానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రెండో ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. చిన్నయ్య డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తుండేవాడని.. కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. చిన్నయ్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

వెల్దండ: మండలంలోని రాఘాయపల్లి సమీపం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని మహిళ మృతదేహం శుక్రవారం లభ్యమైందని ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందినట్లు వివరించారు. వయోలెట్ రంగు నైటీ ధరించిందని.. మతిస్థిమితం సరిగా లేక భిక్షాటన చేసే మహిళ అయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పెద్దాపూర్ కార్యదర్శి సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లు 87126 57756, 87126 61808, 87126 57755 సంప్రదించాలని సూచించారు.

కేసరి సముద్రంలో వ్యక్తి మృతదేహం..

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని కేసరి సముద్రం చెరువులో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ వివరించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మరిన్ని వివరాలకు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.


రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ బ్రిడ్జి కింద శుక్రవారం గుర్తు తెలియని మహిళ(40) రైలు కిందపడటంతో శరీరం రెండు ముక్కలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఎవరైనా కుటుంబ సభ్యులు ఉంటే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెట్టింగ్ భూతం

నేటి నుంచే ఐపీఎల్

- నిత్యం కోట్లల్లో చేతులు మారే అవకాశం
- పాలమూరులో పెట్రోల్ వ్యాపారం చేసే వ్యక్తి పెద్ద బుకీ
- అప్పులు తీర్చలేక తనువు చాలిస్తున్న యువకులు



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో బెట్టింగ్ భూతం జడలు విప్పుతోంది. బెట్టింగ్ యాప్‌లే కాకుండా, ఐపీఎల్ బెట్టింగ్‌కు అలవాటుపడిన యువత లక్షల్లో నష్టపోతున్నారు. ఇటీవల బాలానగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు బెట్టింగ్ చేయడానికి సమీప బంధువు ఖాతాల్లో ఉన్న రూ.24లక్షలు దశల వారీగా ఖాతాలో నుంచి విత్‌డ్రా చేశాడు. ఈ యువకుడిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా కేంద్రంలో జరిగిన మరో ఘటనలో లక్షల్లో అప్పులు కావడంతో ఓయువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.

■ పాలమూరులో బెట్టింగ్ లైన్ నడపడంలో పేరు మోసిన వ్యక్తులు చాలా మంది ఉన్నారు. ఆన్‌లైన్ యాప్స్ ద్వారా నకిలీ అకౌంట్స్‌తో తప్పుడు సిమ్‌లు ఏర్పాటు చేసుకొని ఈ వ్యవహారం నడుపుతున్నారు. పాలమూరులో పెట్రోల్ వ్యాపారం చేసే ఓవ్యక్తి పెద్ద బుకీగా ఏర్పడి అందరికి లైన్, యాప్ ద్వారా బెట్టింగ్ నడిపిస్తున్నాడు. ద్వితీయ శ్రేణిలో కొందరు రాజకీయ రంగులో బెట్టింగ్ ఆడిస్తుంటే.. మరికొందరు అదే వృత్తిగా దందా కొనసాగిస్తున్నారు.

ఫస్ట్ మ్యాచ్‌కు లక్షలు

శనివారం రాత్రి చెన్నై–ముంబై జరగనున్న మొదటి మ్యాచ్ కోసం ముందే జిల్లాలో బెట్టింగ్ కోసం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ మ్యాచ్ కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక వేస్తున్నారు. కొందరు బుకీలు మైదానం నుంచే పరిస్థితిలను జిల్లా లో ఉండే వారికి అందజేయ దానికి అవసరం అయిన ఏర్పా ట్లు చేసుకుంటున్న సమాచారం.

సెల్‌ఫోన్‌లే ఆధారం..

ఐపీఎల్ బెట్టింగ్‌ను సెల్‌ఫోన్ ద్వారానే కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జడ్చర్ల, దేవరకద్రలో ప్రత్యేక అడ్డాల్లో ఈ వ్యవహారం సాగుతోంది. మ్యాచ్ ప్రారంభం కంటే ముందే పందేలు షూర్ అవుతున్నాయి. ఎవరు టాస్ గెలుస్తారు..ఎవరు బ్యాటింగ్ ఎంచుకుంటారు. ఎ బ్యాట్స్‌మెన్ ఎన్ని పరుగులు చేస్తాడు..ఏ బౌలర్ ఎన్ని వికెట్లు తీస్తాడు అనే అంశంతో పాటు ప్రతి బంతికి పందేం ఉంటుంది. ఇలా ఒక్కో ఆటగాడిపై వ్యక్తిగతంగానూ బెట్టింగ్ అధిక సంఖ్యలో సాగుతోంది. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి కోడ్ భాషను వాడుకలోకి తెచ్చారు. రెండ్లు జట్లు ఆడుతుంటే జట్టు సభ్యుల దుస్తుల రంగును బట్టి కోడ్ వాడుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అండగా..

ఈసారి బెట్టింగ్ సాంకేతికంగా దూసుకుపోతుందని సమాచారం. వాట్సప్‌లాంటి సామాజిక మాధ్యమాలతో పాటు యాప్‌లను ఉపయోగించనున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ నిర్వాహకులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకొని రూ. లక్షల్లో వ్యాపార సామ్రాజ్యానికి తెరలేపుతున్నారు. గతంలో కేవలం మహానగరాలకే పరిమితమై పరిజ్ఞానాన్ని నిర్వాహకులు ఇక్కడ వాడుకుంటున్నారు. ప్రధానంగా యువతను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని బుకీలు దందాను కొనసాగిస్తున్నారు. వాట్సప్‌లో రూ.3వేలు చెల్లించి ఒక లైన్ తీసుకుంటున్నారు. దాని ద్వారా మ్యాచ్ స్థితిగతులు బుకీలకు తెలుస్తుంటాయి. టాస్ వేసిన క్షణం నుంచి చివరి బంతి వరకు బెట్టింగ్ స్వరూపాలు మారుతుంటాయి.. కొందరు మ్యాచ్ ఓడిపోతుందనే సందర్భం కన్పిస్తుంటే ఎక్కువ రేటింగ్ ఇచ్చి వేరే జట్టుకు మార్చుకుంటారు. ఇలా చేయడం వల్ల నిర్వాహకులకు అధిక లాభాలు ఉంటాయి. రేటింగ్ ఎక్కువ ఉన్న జట్టును తీసుకుంటే రూ.10వేలకు రూ.15వేలు చెల్లించాల్సి ఉంటుంది. రాత్రి బెట్టింగ్‌లో ఓడిపోయిన వారి దగ్గర మరసటి రోజు ఉదయం ఒక వ్యక్తి వచ్చి డబ్బు తీసుకొని వెళ్లి లైన్‌లో పెడుతుంటాడు. ఇది నిత్యం జరుగుతున్న తీరు.

■ క్రికెట్ బెట్టింగ్‌పై మోజుతో యువత ప్రాణాల మీదికి తెచ్చుకొంటున్నారు. శనివారం నుంచి ఐపీఎల్ పోటీలు మొదలవుతున్న తరుణంలో కొందరు యువకులు బెట్టింగ్‌కు సిద్ధమవుతున్నారు. జిల్లా నలుమూలలా తిష్టవేసిన కొందరు ఈతీరును శాసిస్తున్నారు. యువతను వక్రమార్గం పట్టిస్తున్నారు. చాపకింద నీరులా జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ విస్తరిస్తోంది. పైకి పోలీసులు అలాంటిదేమి లేదని చెబుతున్నా మూలాలను వెతికిపట్టి అడ్డుకట్ట వేయడంలో వారి వైఫల్యం కనిపిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహస్యంగా జిల్లా కేంద్రంలో కొందరు వ్యాపారులు, యువత పోలీసుల కళ్లు గప్పి ఈ తంతును యథేచ్ఛగా నడిపిస్తున్నారు. ఈ మోజులోపడి లక్షల రూపాయల్ని పొగొట్టుకున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 15ఏళ్ల బాలుడు రూ.200నుంచి మొదలు పెడుతుండగా 45ఏళ్ల వ్యక్తి రూ. వెయ్యి నుంచి రూ.1లక్ష వరకు బెట్టింగ్ కాస్తున్నారు. హోటళ్లు, బేకరీలు, కిరాణం , శీతల పానీయాల దుకాణాలు, పాన్‌షాప్, ప్రత్యేక గదులను అద్దెకు తీసుకొని బెట్టింగ్ ఆడుతున్నారు. కష్టం పడకుండా డబ్బులు సంపాదించొచ్చనే అత్యాశతోనే యువకులు పెడదోవ పడుతున్నారు. రూ.2వేలు కడితే నాలుగు రేట్లు అంటే రూ.8వేలు డబ్బులు వస్తాయంటూ ఆశపడుతున్నారు.

పాత వ్యక్తులపై నిఘా..

జిల్లాలో గతంలో బెట్టింగ్ ఆడుతూ పట్టుబడటంతో పాటు కేసుల్లో పట్టుబడిన వ్యక్తులపై నిఘా పెడతాం. కొత్తగా స్థావరాలు ఏర్పాటు చేసి ఏమైనా ఆడుతున్నారో పరిశీలిస్తాం. పోలీసులు ఆయా స్టేషన్ పరిధిలో ఉండే వారిపై తరచూ తనిఖీలు చేయిస్తాం. ఇటీవల టూటౌన్ పరిధిలో బెట్టింగ్ ఆడుతున్నట్లు అనుమానం ఉన్న కొందరు యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

కొలిక్కిరాని డీఎల్‌ఐ భూ పరిహారం పంపిణీ


గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీను

చారకొండ: మండలంలోని డిండి– నార్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో భూములు కోల్పోతున్న సిర్సనగండ్ల ఆలయ భూమి, కొన్నేళ్లుగా సాగు చేస్తున్న రైతులు ఎవరికి భూ పరిహారం అందించాలని విషయమై శుక్రవారం మండలంలోని కమాల్‌పూర్‌లో కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను అధ్యక్షతన గ్రామసభ నిర్వహించగా కొలిక్కి రాలేదు. కమాల్‌పూర్ శివారులో సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయానికి సంబంధించి 51.32 ఎకరాల భూమి కాల్వ నిర్మాణంలో కోల్పోతుంది. దీంతో ప్రభుత్వం భూ పరిహారం కింద ఎకరాకు రూ.5.30 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ పరిహారం పంపిణీపై శుక్రవారం గ్రామసభలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గత కొన్నేళ్లుగా భూములు నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమకే పరిహారం దక్కాలని కమాల్‌పూర్ రైతులు వేడుకున్నారు. అయితే భూ పట్టాలు తమ పేరిట ఉన్నందున దేవాదాయ శాఖకు పరిహారం చెల్లించాలని దేవాదాయ శాఖ అధికారులు పట్టుబట్టారు. దేవాలయ భూములు ఉన్న అభివృద్ధి చెందలేదని వారు పేర్కొన్నారు. దీంతో ఆర్డీఓ శ్రీను మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో రైతులు ఏ సర్వే నంబర్‌లో ఎంత పొలం సాగు చేస్తున్నారు.. తదితర వివరాలపై తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి, దేవాదాయ తహసీల్దార్ గిరిధర్, ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ ఆంజనేయులు, మేనేజర్ నిరంజన్, డీఎల్‌ఐ ఏఈ సుభాషిణి, ఆర్‌ఐ భరత్‌గౌడ్, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగుతున్న అన్వేషణ


లోకో ట్రైన్‌లో సొరంగంలోకి గ్యాస్ సిలిండర్లు తరలిస్తున్న సహాయక బృందాలు

- 28వ రోజుకు చేరిన సహాయక చర్యలు
- కార్మికుల జాడ కోసం ప్రయత్నిస్తున్న అధికారులు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో 28వ రోజు శుక్రవారం సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టినా ఏడుగురు కార్మికుల జాడ లభించలేదు. సహాయక చర్యలకు ఆటంకంగా ఉన్న టీబీఎం యంత్రాన్ని దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది అల్ట్రా థర్మల్ కట్టర్స్‌తో తొలగిస్తున్నారు. తవ్వకాలకు అడ్డుగా వస్తున్న బండరాళ్లను ఇటాచీలతో తొలగించి లోకో రైలులో బయటకు తరలిస్తున్నారు. నీటి ఊట, బురదను వాటర్ జెట్‌తో, మట్టిని కన్వేయర్ బెల్టుపై తరలించే ప్రక్రియ కొనసాగుతుంది. కార్మికుల ఆచూకీ కోసం డి–1 పాయింట్ వద్ద తవ్వకాలు కొనసాగిస్తున్నారు.

అందుబాటులోకి రాని రోబోల సేవలు..

40 మీటర్ల అత్యంత ప్రమాద ప్రదేశంలో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టేందుకు ఈ నెల 11న రోబోలు సొరంగం వద్దకు చేరుకున్నా.. ఇప్పటి వరకు వాటి సేవలు అందుబాటులోకి రాలేదు. పదిరోజులు దాటినా ఇంతవరకు సొరంగం లోపలికి వెళ్లలేదు. సొరంగంలో హైడ్రాలిక్ రోబో పనిచేయాలంటే టీబీఎం శకలాలు పూర్తిగా తొలగించాల్సి ఉంది. హైడ్రాలిక్ వ్యవస్థతో పనిచేసే రోబో ముందు భాగంలో ఉన్న గ్రైండర్ పెద్దపెద్ద రాళ్లు, శిథిలాలను ముక్కలుగా చేయడంతో పాటు బురదను వాక్యూమ్ పంపు సాయంతో నేరుగా కన్వేయర్ బెల్టుపై వేస్తోంది. అయితే టీబీఎం భాగాలు (ఇనుపరాడ్లు) అడ్డు రావడంతో రోబో సేవలకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

టీబీఎం భాగాలు తొలగిస్తున్నారు..

సొరంగంలోని డి–1, డి–2 ప్రదేశాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, వికాస్‌సింగ్, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి డా. హరీశ్, సింగరేణి రెస్క్యూ జీఎం బైద్యతో సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. రోజువారీగా టీబీఎం భాగాలు కత్తిరించి బయటకు పంపిస్తున్నామని.. నీటి ఊటను డీవాటరింగ్ చేస్తూ సహాయక చర్యలు ముమ్మరం చేశామన్నారు. అధునాతన యంత్రాలతో నిరంతరాయంగా ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నామని, ఉన్నతాధికారులు సహాయక బృందాల సేవలను పర్యవేక్షిస్తూ చర్యలను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.


సొరంగం నుంచి బయటకు వస్తున్న నీటి ఊట

కూలీ కోసం వెళ్తే.. కాటికి పంపారు


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు, కుటుంబసభ్యులు

- లైన్‌మేన్, ఆపరేటర్ నిర్లక్ష్యంతో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి
- నారాయణపేట జిల్లా ఎర్సాన్‌పల్లిలో ఘటన


సిరిపే మహేష్ (ఫైల్)


వాదులాడుకుంటున్న లైన్‌మేన్ లింగప్ప, ఆపరేటర్ లక్ష్మణ్

మక్తల్: బతుకుదెరువు కోసం కరెంట్ (కూలీ) పనులు చేసేందుకు వెళ్లిన ఓ యువకుడు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన సిరిపే మహేష్(23) అదే గ్రామానికి చెందిన చిన్న వెంకటేష్‌తో కలిసి కరెంట్ పనులు చేసేందుకు కూలీగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం కర్ని గ్రామ శివారులోని ఎర్సాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతుల పొలాలకు కొత్తగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు వెళ్లారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ చిన్న వెంకటేష్ సంబంధిత లైన్‌మేన్ లింగప్పకు చెప్పగా కరెంట్ నిలిపివేశారు. కొద్దిసేపటి తర్వాత అకస్మాత్తుగా కరెంట్ సరఫరా కావడంతో విద్యుత్ స్తంభంపై వైర్లు సరిచేస్తున్న సిరిపె మహేష్ ఒక్కసారిగా షాక్‌కు గురై స్తంభంపైనే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో వెంటనే కూలీలు లైన్‌మేన్ లింగప్పకు సమాచారం అందించడంతో లైన్‌మేన్ లింగప్ప కర్ని సబ్‌స్టేషన్‌కు వద్దకు చేరుకొని ఆపరేటర్ లక్ష్మణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నీదంటే నీది తప్పంటూ వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా లైన్‌మెన్ లింగప్ప మరో వ్యక్తితో వీడియో తీయించి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసి.. తన తప్పు లేదని కప్పిపుచ్చుకునేందుకు ఇలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత లైన్‌మేన్, ఆపరేటర్ సెల్‌ఫోన్ స్విచ్చాప్ చేసుకుని ఇద్దరూ పరారయ్యారు. అయితే ఆపరేటర్ లక్ష్మణ్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం.

కుటుంబీకుల ఆందోళన

సమాచారం తెలుసుకున్న సిరిపె మహేష్ తల్లిదండ్రులు పోలప్ప, భీమమ్మతో పాటు బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మహేష్ మృతికి లైన్‌మేన్ లింగప్ప, ఆపరేటర్ లక్ష్మణ్ కారణమని ఆరోపిస్తూ కర్ని సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం మృతదేహంతో మక్తల్‌కు చేరుకుని అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేపట్టారు. సమాచారం అందుకున్న మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి అక్కడికి చేరుకొని కుటుంబీకులకు నచ్చజెప్పి మృతదేహాన్ని స్థానిక సబ్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లేలా ఒప్పించారు. అక్కడ విద్యుత్ శాఖ డీఈ నర్సింగ్‌రావు, ఏడీ జగన్‌మోహన్, ఏఈ రామకృష్ణ తదితరులు వచ్చి మహేష్ బంధువులతో చర్చలు జరపగా పరిహారంగా రూ.8 లక్షలు అందజేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. అనంతరం మహేష్ మృతదేహాన్ని మక్తల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్ : భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. వివరాలు.. మండలంలోని పేరపల్ల సమీపంలోని డ్రైవర్ గోపితండాకు చెందిన శారు రాథోడ్ (20)ను సమీపంలోని రెడ్యానాయక్ తండాకు చెందిన మేనత్త కొడుకు వినోద్‌నాయక్‌కు ఇచ్చి పెళ్లి చేయాలని ఇరు కుటుంబాయి నిర్ణయించాయి. మేనరికం పెళ్లి ఇష్టం లేకపోయినా వినోద్‌నాయక్ పెద్దల మాటకు అడ్డు చెప్పకుండా జనవరి 21న వివాహం చేసుకున్నాడు. గడిచిన ఈ రెండు నెలల నుంచి భార్యకు దూరంగానే ఉంటూ తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీ సాయంత్రం మరోసారి భార్యతో గొడవ పెట్టుకొని ఆమెను కొట్టాడు. కుటుంబ సభ్యులు కలుగజేసుకొని వినోద్‌ను బయటికి పంపించారు. రాత్రి తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత మరోసారి గొడవ పెట్టుకొని ఆమె గొంతును నులిమి చంపాడు. అనంతరం నేరం తన మీదుకు రాకుండా ఉండేందుకు అందరిని నమ్మించడానికి పురుగుమందు తాగించి, చీరతో ఉరి వేసే ప్రయత్నం చేశాడు. అది విఫలం కావడంతో ఇంట్లో నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి, టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లతో కలిసి విచారణ జరిపారు. 24 గంటల్లో నిందితుడిని పట్టుకొని రిమాండ్ తరలించారు.

రుణాల పేరిట ఘరానా మోసం


రుణం మంజూరైనట్లు బాధితులకు అందజేసిన నకిలీ డాక్యుమెంట్లు

గద్వాల క్రైం: ప్రైవేట్ బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీలకే వ్యవసాయ, ఇంటి నిర్మాణం, వ్యక్తిగత రుణాలు ఇప్పిస్తామని ఓ నకిలీ ఏజెంట్ పలువురి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు కాజేసిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, బ్యాంకు సిబ్బంది కథనం ప్రకారం.. గద్వాల మండలంకు చెందిన ఓ నకిలీ ఏజెంట్ గద్వాల, గట్టు తదితర గ్రామాలకు చెందిన రైతులు, గృహ నిర్మాణం, వ్యక్తిగత రుణాలు తక్కువ వడ్డీకే ఇపిస్తామని బాధితుల నుంచి డబ్బులు వసూలు చేశాడు. అయితే రుణాలు మంజూరు కోసం ఏజెంట్ బాధితుల నుంచి రూ.1–4 లక్షల వరకు వివిధ డాక్యుమెంట్ ఖర్చులు, రుణం మంజూరు చేసే వారికి ఇవ్వాల్సి ఉంటుందని గతేడాది వసూలు చేశాడు. బాధితులకు రుణం రూ.35 లక్షలు మంజూరైనట్లు నకిలీ పత్రాలను అందజేసి.. త్వరలోనే వ్యక్తిగత ఖాతాలో జమ అవుతుందని నమ్మించారు. అయితే నెలలు గడిచినా డబ్బులు జమ కాకపోవడంతో బాధితులు కర్నూలులోని సదరు ప్రైవేట్ బ్యాంకు సిబ్బందితో మాట్లాడారు. రుణాలు మంజూరు చేసిన పత్రాలను చూయించగా నకిలీవి అని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించి గద్వాల పట్టణ పోలీసులను ఆశ్రయించారు. నకిలీ రుణాలు మంజూరు చేసిన పత్రాలు సదరు ప్రైవేట్ బ్యాంకు పేరుతో ఉండడంతో సదరు బ్యాంకు సిబ్బంది సైతం పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ మాట్లాడుతూ బాధితులు, బ్యాంకు సిబ్బంది జరిగిన సంఘటన తమ దృష్టికి తెచ్చారని, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తామన్నారు.

కల్వకుర్తిలో చోరీ


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో ఇంట్లో దొంగలు పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి, బాధితులు తెలిపిన వివరాలు.. తిలక్‌నగర్ కాలనీలో నివాసముండే శ్రీను తన బంధువుల ఇంటికి కుటుంబంతో కలిసి గురువారం ఉదయం వెళ్లాడు. శుక్రవారం ఉదయాన్నే ఇంటికి తిరిగివచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనస్థలికి చేరుకున్న ఎస్‌ఐ, క్లూస్ టీం సిబ్బందితో క్లూస్ సేకరించారు. ఇంట్లో మూడు తులాల బంగారం, 40 తులాల వెండి, సుమారు రూ.లక్ష నగదు చోరీ జరిగినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మన్ననూర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ రజిత కథనం ప్రకారం.. కొల్లాపూర్‌కు చెందిన ఎత్తం మల్లయ్య మన్ననూర్‌లో ఓ వ్యక్తి వద్ద కొంతకాలంగా నెల వేతనానికి పనులు చేస్తున్నాడు. చేసిన కష్టానికి తగిన జీతం ఇవ్వడం లేదని మద్యం తాగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చెప్పాడు. ఎస్‌ఐ ఉదయం రావాలని సూచించగా.. క్షణికావేశానికి లోనై పోలీస్‌స్టేషన్ బయట రోడ్డుపైకి వచ్చి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే స్థానికులు, పోలీసులు అతడిని కాపాడారు.

లైంగిక వేధింపుల చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి డి.ఇందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ పరిష్కార 2013 చట్టంపై మహిళలందరికీ అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మీటింగ్‌హాల్‌లో మహిళా ఉద్యోగులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపులపై న్యాయ అవగాహన సదస్సును నిర్వహించినట్లు తెలిపారు. పది అంతకన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న ప్రతి పని ప్రదేశంలో ఒక అంతర్గత ఫిర్యాదులు కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడికి వెళ్లినా మహిళలకు భద్రత లేకుండా పోతుందని.. అందుకే ఏమైనా సమస్యలు వచ్చిన వెంటనే న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని సూచించారు. లైంగిక వేధింపుల యు/ఎస్ 354ఐపీసీని ఇప్పుడు కొత్త చట్టం 74 బీఎన్‌ఎస్‌గా మార్చినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలపై వేధింపులు జరిగితే వెంటనే అంతర్గత ఫిర్యాదు కమిటీలో ఫిర్యాదు చేయాలని సూచించారు. అన్ని శాఖల్లో కూడా ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా శిశు సంక్షేమాధికారి జరీనాబేగం మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో వివిధ కార్యాలయాల్లో 48 అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మూడు ఫిర్యాదులను ఈ కమిటీల ద్వారానే పరిష్కరించినట్లు వివరించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా.. తమ వద్దకు రావచ్చని, తప్పనిసరిగా బాధితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ ముసాయిదా బేగం, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు